## క్లుప్తంగా

### విద్యార్థిని వీణకు కలెక్టర్ అభినందన

నారాయణపేట టౌన్: మండల పరిధిలోని కోటకొండ జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి పరీక్షలో స్కూల్ టాపర్‌గా నిలిచిన కొతిమిరి వీణను కలెక్టర్ శ్రీహర్ష శాలువాతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రవి, గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### సమావేశంలో పాల్గొన్న నాయకులు

నారాయణపేట టౌన్: హైదరాబాద్‌లో జరుగుతున్న తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో నారాయణపేట జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నరసింహ, రాష్ట్ర నాయకులు గుంపు బాలరాజు, జిల్లా కోశాధికారి కిశోర్ కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం చేయాల్సిన కృషి గురించి ప్రత్యేకంగా చర్చ ఉంటుందని నాయకులు తెలిపారు.

### లింగాయత్ ర్యాలీకి తరలిరావాలి

కృష్ణా: లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 4వ తేదీన హైదరాబాద్‌లో మహార్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు శివరాజ్‌పాటిల్, మండల నాయకులు మజ్జిగ సురేష్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ర్యాలీకి మండలంలో వీరశైవులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో విద్యసాగర్, ఆలంపల్లి మేటి సిద్దప్పగౌడ, రాజప్పగౌడ, వీరేష్, మల్లికార్జున్, సురేష్, చెన్నబసవస్వామి పాల్గొన్నారు.

### మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా వెంకట్‌రాములు

మక్తల్: మండలం మంతన్‌గోడ్‌లో మత్స్యశాఖ సహకార సంఘం గ్రామం అధ్యక్షుడిగా మాజీ ఎంపీటీసీ వెంకట్‌రాములును మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఉపాధ్యాయుడు గడ్డబోడి బుగ్గప్ప, తెలుగు రాములు, ఆంజనేయులు, వెంకటప్ప, బోడి బుగ్గప్ప, సువన్న, కురుమూర్తి, వెంకటేష్‌లు ఎన్నికయ్యారు.

### ‘అభివృద్ధిలో విఫలం’

ధన్వాడ: మండల అభివృద్ధిలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొదిగెల శ్రీనివాస్ అన్నారు. గున్ముక్లలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా అడివప్ప, ఉపాధ్యక్షుడిగా అంజన్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాము, కార్యదర్శిగా నర్సిములు, కోశాదికారిగా హన్మంతును ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, మండల అధ్యక్షుడు రవియాదవ్ తదితరులు ఉన్నారు.

### ఆర్థికసాయం అందజేత

నర్వ: మండల కేంద్రానికి చెందిన కుర్వ లక్ష్మయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న నర్వ పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

### గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులు

దామరగిద్ద: మండలంలోని వివిధ పాఠశాలలకు 38 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలో సత్తాచాటి గురుకులకు ఎంపికయ్యారు. మండలకేంద్రంలోని జీపీఎస్‌కు 16 మంది, ఎంపీపీఎస్ కంసాన్‌పల్లికి చెందిన ముగ్గురు. మొగుల్‌మడ్కకు చెందిన 12 మంది, లోకూర్తి ప్రాథమిక పాఠశాలకు చెందిన 6 గురు, యూపీస్ మల్‌రెడ్డిపల్లికి చెందిన ఒకరు వీరిలో ఉన్నట్లు ఎంఈఓ గోపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెచ్ఎంలు విద్యార్థులను అభినందించారు.

### మధ్యప్రదేశ్ యోగా శిక్షణలో మండల మాస్టర్లు

నర్వ: ఏకాత్మాభియాన్ కార్యక్రమంలో భాగంగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ధాన్య శిక్షణలో హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ కోఆర్డినేటర్‌లు మాస్టర్ నారాయణరెడ్డి, శివకుమార్‌లు పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు శిక్షణలో పాల్గొన్నట్లు వారు వివరించారు.

### సరుకుల పంపిణీ

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను మంగళవారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గాండ్ల రఘు, జిల్లానాయకులు మెకానిక్ షబ్బీర్, గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదలను గుర్తించి నిత్యావసర సరుకులను అందిస్తున్నట్లు తెలిపారు. మస్‌జిదేనూర్ సమీపంలో నివాసముంటున్న యాసీన్ కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని విషయం తెలుసుకుని నిత్యావసర సరుకులతో పాటు నగదును అందించినట్లు తెలిపారు.

# డ్రెయిన్లు లేని రోడ్డు నిలిచేనా?

దామరగిద్ద: ఏడేళ్ల క్రితం దామరగిద్ద– యానగుంది వరకు 11.5 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ. 13 కోట్ల నిధులతో స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చొరవతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. కాగా ఇందులో భాగంగా దామరగిద్ద గ్రామంలో మినహా మిగిలిన 10.08 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పూర్తి చేశారు. దామరగద్దలో సంజీవరాయ చౌరస్తా నుంచి గ్రామ పంచాయతీ వరకు రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు ఉండటంతో ఇన్నాళ్లుగా 700 మీటర్ల రహదారి విస్తరణ పెండింగ్‌లో ఉండగా స్థానిక ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే చొరవతో ఇళ్లు కోల్పోయే వారికి ప్రభుత్వం అందించే డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత కల్పిస్తామని రాత పూర్వక హామీ ఇచ్చారు. ఆరు నెలలుగా పనుల్లో పురోగతి లేక పోగా ఇటీవల జీఎస్‌బీ 200 ఎంఎం మెటల్ నిర్మాణం పూర్తి చేశారు.


డ్రెయిన్లు లేకుండా చేపట్టిన రోడ్డు నిర్మాణం పనులు


నిలిచిన మురుగునీటి పారుదల

#### సైడ్ డ్రెయిన్ లేకుండానే రోడ్డు నిర్మాణం..

రోడ్డు విస్తరణకు గత డిసెంబర్‌లో ఇళ్ల తొలగింపు ప్రారంభిచారు. దీంతో గతంలో ఉన్న మురుగు కాల్వలు పూడిపోయి మురుగు నీరు రోడ్డు పక్కనే నిలుస్తోంది. సైడ్ డ్రెయిన్ లేకుండా రోడ్డు పనులు పూర్తి చేయడంతో మురుగునీరు, వర్షం నీటి నీటి వరదలతో రోడ్డు నిర్మాణం దెబ్బతిని కోతకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు రోడ్డుతో పాటు మురుగు నీటి కాల్వలు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. కాగా సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి సీఆర్‌ఎఫ్‌లో నిధులు కేటాయించారని అధికారులు చెబుతున్నారు.

#### నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం..



రోడ్డు నిర్మాణం చేపట్టిన సీఆర్‌ఎఫ్ గ్రాంట్స్‌లో సైడ్ డ్రెయిన్ నిర్మాణానికి నిధులు కేటాయించారు. నిధుల మంజూరు లేనందున డ్రెయిన్ల నిర్మాణం చేపట్టలేదు. కొత్తగా రోడ్డుకు ఇరువైపుల డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించి, నిధులు మంజూరు కాగానే నిర్మిస్తాం

– రాములు, డీఈ, ఆర్‌అండ్‌బీ

## ఆయిల్‌పాం సాగు లాభదాయకం

కోస్గి: రైతులు ఆయిల్ పాం సాగు చేసుకోవడం ఎంతో లాభదాయకమని ఏఈఓ వినోద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం 90 శాతం రాయితీతో సాగును ప్రోత్సహిస్తోందని అన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఏఈఓలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇదే క్రమంలో రైతులు తమ పొలంలో పచ్చిరొట్ట ఎరువులు వేసుకొని కలియదున్నడం వల్ల భూముల సారం పెరుగుతుందన్నారు. రైతుబీమా పథకానికి ఏఈఓలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందులో గ్రామ రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఓ వినోద్

## కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు


హెల్త్ కార్డులను అందజేస్తున్న సర్పంచ్

మరికల్: మండలంలోని ఎలిగండ్ల పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం వివిధ రంగల్లో పని చేస్తున్న కార్మికులకు సీఎస్‌సీ హెల్త్ కేర్ వెల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ దేవమ్మ ప్రారంభించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ కార్మికులకు 50 రకాల పరీక్షలు చేశారని తెలిపారు. అనంతరం సర్పంచ్ చేతుల మీదుగా హెల్త్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏల్ఓ రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ మోహన్, చిన్నబాలు, రాములు, నర్సిములు, హుస్సేన్ పాల్గొన్నారు.

## వైభవంగా గజలేశ్వరీదేవి జాతర


బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లో కొలువుదీరిన శ్రీ గజలేశ్వరి దేవి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. జల్దిబిందె ఊరేగింపు, అమ్మవారి పల్లకీసేవ, బోనాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, మహా మంగళ హారతి, అన్నదాన కార్యక్రమం, రెట్టపట్ల పోటీలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

మద్దూరు: మండలంలోని కొత్తపల్లి, ఖాజీపూర్, మద్దూరు, భూనీడ్ తదితర గ్రామాల్లో పోచమ్మకు బోనాలేత్తారు. ఆయా గ్రామాల్లో మహిళలు బోనమెత్తుకొని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మేకలు, కోళ్లను అమ్మకు సమర్పించారు.

**మంత్రోనిపల్లిలో..**

ధన్వాడ: మంత్రోనిపల్లిలో మంగళవారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ శాంతమ్మ, ఉపసర్పంచ్ చెన్నయ్య, వెంకటస్వామి, నర్సింలు, ఆంజనేయులు, రాజు, రమేష్, నరేందర్ పాల్గొన్నారు.

దామరగిద్ద: మండల కేంద్రంలో వెలసిన పోచమ్మ తల్లి జాతర ఉత్సవాలను మంగళవారం నిర్వహించారు. సామూహిక బోనాలతో అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు.

## రైతుల భూమి వేలంపాట ఆపాలి

ఆత్మకూర్: రైతులు తమ భూములు తాకట్టు పెట్టి బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారని, నష్టాల ఊబిలో పడ్డ రైతుల భూముల వేలం పాటను రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రాబర్ట్, సీపీఐఎంఎల్ ప్రజాపంథా కార్యదర్శి ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్ సింధూజకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని మొట్లంపల్లికి చెందిన కావలి పెద్దరాములు స్థానిక డీసీసీ బ్యాంకులో దీర్ఘకాలిక రుణం పొంది గొర్రెలు తీసుకోగా.. వింత వ్యాధితో అవి చనిపోయాయని వాపోయారు. ఇంతలోనే బ్యాంకు అధికారులు భూమిని వేలంపాట నిర్వహిస్తున్నా మని నోటీసులు ఇవ్వడం సబబు కాదని, అవమానంతో రైతు కుటుంబం అఘాయిత్యానికి పాల్పడక ముందే వేలంపాటను విరమించా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింహయ్యశెట్టి, వెంకటన్న, లింగన్న ఉన్నారు.

## సీసీరోడ్డు పనులు ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక భగీరథ కాలనీ చౌరస్తా నుంచి మైనారిటీ గురుకుల పాఠశాల వరకు రూ.15 లక్షలతో సీసీరోడ్డు పనులను రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్‌చైర్మన్ తాటి గణేష్‌కుమార్, 11వ వార్డు కౌన్సిలర్ ఎస్.శ్రీనివాసులు, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మండలం ఏర్పాటుపై కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణపేట: కోటకొండ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు బి.రాము, బీజేపీ రాష్ట్ర నాయకులు కెంచె శ్రీనివాసులు, సర్పంచ్ విజయలక్ష్మి, మండల సాధన సమితి కో కన్వీనర్ యాదగిరి, చెన్నప్ప యాదవ్, సాక ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**21వ రోజుకు చేరిన రీలే దీక్షలు..**

కోటకొండను మండలంగా ప్రకటించాలంటూ చేపట్టిన రీలే దీక్షలు మంగళవారంతో 21వ రోజుకు చేరుకున్నాయి. బొలేరో వాహనాల యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రీలే దీక్షలో అంగడి బాలకృష్ణ, తీగలరాజు, పేట నారి, కాశీ, రఘు, శ్రీనివాస్‌రెడ్డి, శివరాజ్, తిరుమలేష్, వెంకటేశ్, రామలింగం, ఖాజా, చుక్కరాజు, బండ కనకప్పలు ఉన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



మక్తల్: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన దేవప్ప అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.28, 500 లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం బాధితుడికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చెక్కు అందజేశాడు. కార్యక్రమంలో కౌన్సిలర్ మొగులప్ప, శేకర్‌రెడ్డి, కృష్ణ, అమరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యలు

మాగనూర్: రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని సీఐ సీతయ్య, ఎస్ఐ నరేందర్ అన్నారు. ఇందులో భాగంగా మంగళవారం జాతీయ రహదారి–167పై రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహనాల వేగ నియంత్రణకు డ్రమ్స్‌తో వేగ నియంత్రణ స్టాపర్స్ జిగ్‌జాగ్ రూపంలో ఏర్పాటు చేశారు. ఈ ఒసదర్భంగా సీఐ సీఐ సీతయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పకుండా వినియోగించాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వాకిటి శ్రీనివాసులు, బాలరాజ్, కానిస్టేబుల్ రాజశేఖర్‌రెడ్డి, సాయికుమార్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.


డ్రమ్స్ ఏర్పాటును పరిశీలిస్తున్న సీఐ సీతయ్య

## ప్రజాగర్జన పోస్టర్ విడుదల



ధన్వాడ: సీపీఐ ఆధ్వర్యంలో ఈ వచ్చే నెల 4న కొత్తగూడెంలో నిర్వహించే ప్రజాగర్జన బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్ విడుదల చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సభలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్‌రెడ్డి

ధన్వాడ: రాయిచూర్ దొర పాలన ఇక చాలని, ఇంటికి పంపిచే సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివకుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా రాయిచూర్‌లో ఉండే దొర చేసింది ఏమీ లేదని అన్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కంసాన్‌పల్లి గ్రామం నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం మండల కమిటీలపై కార్యకర్తలతో అభిప్రాయ సేకరణ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడిగా కావలి నరహరిని తిరిగి ఎంపిక చేశారు. కార్యక్రమంలో శివకుమార్, బాలకృష్ణ, దామోదర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోవా మద్యం పట్టివేత




కృష్ణా: గోవా నుంచి ఓ ప్రైవేట్ బస్సులో 4.68 లీటర్ల మద్యం తరలిస్తుండగా మంగళవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గణపతిరెడ్డి వివరాల ప్రకారం మండల సరిహద్దులో గల చెక్‌పోస్టు వద్ద ఉదయం ఎక్సైజ్ అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా గోవా మద్యం పట్టుబడిందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకురావొద్దని ఆయన తెలిపారు. తనిఖీలో ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దాం

నారాయణపేట టౌన్ : రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపీడీఓ రాజు ఒక ప్రకటనలో మంగళవారం పేర్కొన్నారు.

కృష్ణా: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీపీ పూర్ణిమ పాటిల్ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో ఎంపీఓ విజయలక్ష్మీ, ఏఈ సుదర్శన్‌గౌడ్, సర్పంచ్‌లు రాధ మహాదేవ్, శివప్ప, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం మండల స్థాయిలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి హాజరై అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షిస్తారని వివరించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు విధి హాజరు కావాలన్నారు.

మద్దూరు: మండల పరిషత్ కార్యలయంలో బుధవారం గంటలకు దశాబ్ది ఉత్సవాలపై ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు ఇతర ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## ద్విచక్రవాహనాలు ఢీ: ముగ్గురికి గాయాలు

మాగనూర్: మండలంలోని నల్లగట్టు మారెమ్మవ్వ దేవాలయ సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం దగ్గర రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురుకు గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వడ్వాట్ గ్రామానికి చెందిన హన్మంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కృష్ణ మండలంలోని కున్సి గ్రామానికి చెందిన గొర్రె భీమేష్‌లు వేర్వేరుగా నల్లగట్టు మారెమ్మవ్వ దర్శనం కోసం బయలుదేరారు. మర్గమధ్యలో ప్రమాదవశాత్తు రెండు బైక్‌లు ఢీకొన్నాయి. గాయపడిన ముగ్గురిని అంబులెన్స్ వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

మక్తల్: పట్టణంలో కిరాణం, మర్చంట్, కాన్ఫెక్షనరీ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు నూర్‌పాషా, రఘుప్రసన్నభట్, అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సలహాదారులు వి.య్ కుమార్, మన్నానీ సురేష్, ప్రధాన కార్యదర్శి మన్నానీ నాగరాజు, కోశాధికారి పవన్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా కిషోర్, వెంకటేశ్, రమేష్ తదితరులను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

## భక్తిశ్రద్ధలతో ఈదమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

మక్తల్: పట్టణంలో చెరువు కట్ట దగ్గర నూతనంగా ఈదమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం వేద పండితులు ఆలయంలో హోమం ఏర్పాటు చేయగా దంపతులు హాజరయ్యారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దేవత విగ్రహానికి పాలభిషేకం చేశారు. ఆలయంలో పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి దంపతులు హన్మంతు, అఖిలరాజశేఖర్ రెడ్డి, సృజన, రమేష్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, చంద్రకాంత్, గణష్, సుకన్య, మాజీ ఎంపీటీసి కోళ్ళ వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి, శ్యామ్, లక్ష్మన్, శ్రీహరి, బసంత్‌సింగ్, మహిపాల్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.


ఈదమ్మ దేవత విగ్రహాలకు పాలాభిషేకం చేస్తున్న భక్తులు

## పంచాయతీ స్థలాలను కులసంఘాలకు ఇవ్వొద్దు

మరికల్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేసిన వెంచర్‌లో గ్రామ పంచాయతీలకు కేటాయించిన స్థలాలను అందుకు విరుద్ధంగా కుల సంఘాల కమ్యూనిటీ భవనాలకు కేటాయించడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షులడు వేణు, నాయకులు కొండయ్య అన్నారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ లేవుట్ చేసిన వెంచర్‌లో 10 శాతం గ్రామ పంచాయతీకి కేటాయించిన స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు, లేక పార్కులకు వాడుకోవాలన్నారు. ఇక్కడి ప్రజాప్రతినిధులు ఓటు బ్యాంకు రాజకీయల కోసం కులాల మధ్య చిచ్చులు పెడుతూ ఒక వెంచర్‌లోని పంచాయతీ స్థలాన్ని రెండు కుల సంఘాల భవనాలకు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఇలా కేటాయించడం వల్ల గ్రామంలోని ఇతర కులాల వారు కూడా తమ కమ్యునిటీ భవనాల నిర్మాణాలకు పంచాయితీ స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఆయ స్థలాల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి సర్పంచ్, కార్యదర్శి అనుమతి ఇస్తే చట్ట ప్రకారం కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు.

## సైబర్ నేరాలపై అవగాహన

మాగనూర్: అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఆయన సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు కాల్ చేసి వివరాలు అడిగితే చెప్పొద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. గ్రామంలో అనుమానస్పదంగా తిరిగే వ్యక్తుల గురించి డయల్ 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలిసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరేందర్

## పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి


అమరచింత ఎంపీడీఓ వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

అమరచింత: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రసాద్, రాజు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చాలిచాలనీ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులతో పాటు వాటర్‌మెన్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటన్న, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కోశాధికారి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీఓ ప్రకారం రూ.19,500 వేతనాలు ఇవ్వడంతో పాటు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, కొండన్న, దేవన్న, అలివేలమ్మ, రాములు, వెంకటేష్, కుర్మన్న, కార్మికులు ఉన్నారు.